సాక్షి
రంగారెడ్డి
ఆదివారం । 3 । సెప్టెంబర్ । 2023



బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి

బీఆర్‌ఎస్ ప్రభుత్వంతోనే అన్ని విధలా అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. 8లో▸



ప్రాణం తీసిన డ్రైనేజీ గుంత

ఇంటి ఎదుట డ్రైనేజీ నీటి కోసం తవ్విన గుంతను పూడ్చకపోవడంతో అందులో పడి ఓ మహిళ మరణించింది. 8లో▸

9న 'ఎంహెచ్‌ఎం' ప్రవేశ పరీక్ష

లక్డీకాపూల్: మాస్టర్ ఇన్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ (ఎంహెచ్‌ఎం) కోర్సుకు ఈ నెల 9న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు నిమ్స్ డీన్ డాక్టర్ లిజా రాజశేఖర్ తెలిపారు. ఎంట్రెన్స్ ఎగ్జామ్‌కు సంబంధించి హాల్‌టికెట్లను నిమ్స్ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఇందుకు ఈ నెల 4వ తేదీ వరకు గడువు ఉందని తెలిపారు.

న్యూస్‌రీల్

టీటీడీ బోర్డు సభ్యురాలిగా సీతారెడ్డి ప్రమాణస్వీకారం



స్వామివారిని దర్శించుకున్న రంజిత్‌రెడ్డి దంపతులు

చేవెళ్ల: తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) పాలకమండలి సభ్యురాలిగా తెలంగాణ నుంచి ఎంపికైన చేవెళ్ల ఎంపీ డాక్టర్ రంజిత్‌రెడ్డి సతీమణి సీతారెడ్డి శనివారం ప్రమాణస్వీకారం చేశారు. తిరుమలలోని శ్రీవారి ఆలయంలో ఉదయం 11.30 గంటలకు గరుడాళ్వార్ సన్నిధిలో ఆలయ జేఈఓ వీరబ్రహ్మం సీతారెడ్డి చేత ప్రమాణస్వీకారం చేయించారు. టీటీడీ పాలక మండలి సభ్యురాలిగా ప్రమాణస్వీకారం చేసిన అనంతరం ఆమె కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు. రంగనాయకుల మండపంలో సీతారంజిత్‌రెడ్డి దంపతులకు వేద పండితులు ఆశీర్వచనం అందించి తీర్థ ప్రసాదలు అందజేశారు. ఈ సందర్భంగా సీతారెడ్డి మాట్లాడుతూ.. ఆ దేవుడికి సేవ చేసేందుకు అవకాశం కల్పించటం తన పూర్వ జన్మ సుకృతంగా భావిస్తున్నట్లు తెలిపారు. సామాన్య భక్తులకు మెరుగైన సేవలందించేందుకు కృషి చేస్తానని చెప్పారు.

మంత్రులను కలిసిన గోలి శ్రీనివాస్‌రెడ్డి



గోలి శ్రీనివాస్‌రెడ్డిని సత్కరిస్తున్న మంత్రి గంగుల కమలాకర్

ఆమనగల్లు: రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి శనివారం బీసీ, పౌరసరఫరాల శాఖామంత్రి గంగుల కమలాకర్, ఎక్సైజ్, క్రీడాశాఖామంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఇటీవల రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్‌గా ప్రభుత్వం నియమించిన నేపథ్యంతో మంత్రులను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా గోలి శ్రీనివాస్‌రెడ్డిని మంత్రులు ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆమనగల్లు మార్కెట్ కమిటీ డైరెక్టర్ సురమల్ల సుభాష్, సింగిల్‌విండో డైరెక్టర్ నాగులునాయక్, తలకొండపల్లి టీఆర్‌ఎస్ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ స్మారక పురస్కారానికి ఎంపిక



షాద్‌నగర్: జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని పుడమి సాహితీ వేదిక ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ స్మారక పురస్కారాలను అందజేయనున్నారు. ఈ పురస్కారానికి షాద్‌నగర్ పట్టణానికి చెందిన యువ కవి, ఉపాధ్యాయుడు రవి ప్రకాష్ హర్మాళ్ ఎంపికయ్యారు. ఆదివారం నల్లగొండలోని ఎస్వీఆర్ గార్డెన్‌లో నిర్వహించే కార్యక్రమంలో అందుకోనున్నారు.

104 ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సిబ్బంది

ఇబ్రహీంపట్నం రూరల్: 104 ఉద్యోగులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చంద్రమోహన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన చంద్రమోహన్ మాట్లాడుతూ ప్రభుత్వ అధీనంలో పని చేస్తున్నప్పటికీ వేతనాలు మాత్రం ఏజెన్సీల ద్వారా చెల్లించడం దారుణమన్నారు. వచ్చే జీతాలు సకాలంలో అందడం లేదని తెలిపారు. ట్రెజరీల ద్వారా వేతనాలు అందజేయాలని కోరారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, సొంత జిల్లాలకు బదిలీ చేయాలని, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని, 35 క్యాజువల్ సెలవులు, ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా అన్ని రకాల సెలవులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాలు వెంటనే ఇవ్వాలని కోరారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ భూపాల్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో 104 జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, జనరల్ సెక్రెటరీ శ్రీనివాస్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

తట్టుకునేదెట్లా?



దసరా మామూళ్లు

గణేశ్ నవరాత్రులు ముగిసిన కొద్ది రోజులకే బతుకమ్మ ఉత్సవాలు, దసరా నవరాత్రులు ప్రారంభమవుతాయి. అభిమానులు, కార్యకర్తలు నేతలను కలుస్తుంటారు. వీరికి ఎంతో కొంత ముట్టజెప్పాల్సిందే. లేదంటే వారు ఎక్కడ పార్టీ మారుతారోనన్న దిగులు పట్టి పీడిస్తోంది. ఒకవైపు పండగ మామూళ్లు.. మరోవైపు ప్రచార ఖర్చులు అభ్యర్థులకు తడిసి మోపెడుకానున్నాయి.

ఎన్నికలకు తోడు వరుస పండుగలు

- సిట్టింగ్‌లకు ఖర్చు తడిసి మోపెడు
- మరోవైపు అసమ్మతితో తలపోటు
- చేజారిపోకుండా తంటాలు
- ఆందోళనలో అభ్యర్థులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఒకవైపు వరుస పండుగలు.. మరోవైపు తాజాగా కేంద్రం జమిలి ఎన్నికల అంశం తెరపైకి తేవడం.. ఇంకోవైపు సొంతపార్టీలో అసమ్మతి రాగం బీఆర్‌ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యేలను కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. జిల్లా పరిధిలో ఎనిమిది నియోజకవర్గాలు ఉన్నాయి. హైదరాబాద్, సికింద్రాబాద్, చేవెళ్ల, మల్కాజ్‌గిరి, భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గాలు విస్తరించి ఉన్నాయి. ఈనెల 19న గణేశ్ నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కాబోతున్నాయి. యువజన సంఘాలు, కాలనీ సంక్షేమ సంఘాలు, అపార్ట్‌మెంట్ సంక్షేమ సంఘాలు, వర్తక, వ్యాపారులు ఇలా ప్రతి ఒక్కరూ ఏదో ఒకచోట గణేశ్ మండపాన్ని ఏర్పాటు చేసి వినాయకుడికి ఘనంగా పూజలు నిర్వహిస్తుంటారు. మండపాలను అందంగా ముస్తాబు చేయడంతో పాటు భారీ విగ్రహాలను ఏర్పాటు చేస్తుంటారు. పూజలు, అన్నదానం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. ఇందుకు నిర్వాహకులు ఖర్చుల కోసం దాతలను ఆశ్రయిస్తుంటారు. చందాల రూపంలో సేకరిస్తుంటారు. వచ్చే ఎన్నికల్లో ప్రధాన పార్టీల నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేయనున్న వారితో పాటు ఆశావహులను కలిసి చందాలు అడుగుతుంటారు. ఈ నేపథ్యంలో ముందుగా సిట్టింగ్ అభ్యర్థుల్లో ఆందోళన ప్రారంభమైంది. ఎక్కడ వారు అడిగింది ఇవ్వకపోతే ఓటింగ్‌పై ప్రభావం పడుతుందోనన్న గుబులు మొదలైంది.

యువతకు స్పోర్ట్స్ కిట్లు

షెడ్యూల్ ప్రకారం అసెంబ్లీకి డిసెంబర్‌లో ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. కేంద్రం తెరపైకి తెచ్చిన జమిలి అంశంతో ఎన్నికలు వాయిదా పడే అవకాశం లేకపోలేదు. ముందస్తు ప్రకటనతో ఇప్పటికే ప్రచార కార్యక్రమాలు, ఇతర పార్టీల్లో ఉన్న కార్యకర్తలను పార్టీల్లో చేర్చుకునేందుకు అభ్యర్థులు భారీగా ఖర్చు చేస్తున్నారు. దీనికి తోడు ఎన్నికలు వాయిదా పడితే ఖర్చులు మరింత పెరిగే అవకాశం లేకపోలేదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రచారానికి జనాన్ని తరలించడం నేతలకు కష్టంగా మారనుంది. ప్రస్తుతం ఒక్కొక్కరికి రోజుకు రూ.300 నుంచి రూ.500 వరకు చెల్లిస్తుండగా ఆ తర్వాత వీరికి మరింత డిమాండ్ పెరిగే అవకాశం లేకపోలేదు. మరోవైపు యువతను ఆకర్షించేందుకు పెద్ద మొత్తంలో స్పోర్ట్స్ కిట్లు పంపిణీ చేయనున్నారు.

జమిలి గుబులు

ఇక పార్లమెంట్‌తో పాటు అసెంబ్లీ నియోజకవర్గాలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలనే కేంద్ర ప్రభుత్వ ఆలోచన బీఆర్‌ఎస్ సిట్టింగ్ అభ్యర్థుల్లో తీవ్ర ఆందోళనకు కారణమవుతోంది. సాధారణ గడువుకు మూడు నెలల ముందే అధిష్టానం మళ్లీ సిట్టింగ్‌లకే టికెట్ ఇవ్వనున్నట్లు ప్రకటించింది. ఇది ఆశావహులను తీవ్ర నిరాశకు గురి చేసింది. ఇప్పటికే వారంతా ఆయా నియోజకవర్గాల్లో సిట్టింగ్‌లకు వ్యతిరేకంగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. అభ్యర్థులను మార్చాల్సిందిగా అధిష్టానాన్ని అభ్యర్థిస్తున్నారు. తమ విజ్ఞప్తిని కాదని..మళ్లీ వారికే టికెట్ ఇస్తే..మద్దతు నిరాకరిస్తామంటూ అల్టీమేటం కూడా జారీ చేస్తున్న విషయం తెలిసింది. ఇప్పటికే క్షేత్రస్థాయిలో వస్తున్న వ్యతిరేకతకు అసమ్మతి వర్గం తోడవుతుండటంతో ఏం చేయాలో అర్థం కాక తల పట్టుకుంటున్నారు. మొత్తంగా అన్ని విధాలా సిట్టింగుల్లో గుబులు మొదలైంది.



ట్రాఫిక్‌లో చిక్కుకున్న వాహనాలు

'పట్నం'లో భారీగా ట్రాఫిక్‌జాం

- గంటకుపైగా రాకపోకలకు అంతరాయం
- ఇబ్బందులకు గురైన ప్రయాణికులు

ఇబ్రహీంపట్నం: ట్రాఫిక్ జాంతో ఇబ్రహీంపట్నం ప్రధాన రహదారిపై శనివారం సాయంత్రం స్థానికులు, వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. సుమారు గంటకుపైగా రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. హైదరాబాద్–నాగార్జునసాగర్ హైవేపై ఈ రహదారి నిత్యం రద్దీగా ఉంటుంది. స్థానిక అంబేడ్కర్, డాక్‌బంగ్లా చౌరస్తాల వద్ద పాత ఇబ్రహీంపట్నం, మంచాల రోడ్డు, బృందావన్ కాలనీ వైపు వెళ్లేందుకు దారులుంటాయి. ఇక్కడే వాహనాదారులు టర్న్ చేసుకోవాల్సి ఉంటుంది. హైదరాబాద్–సాగర్ రోడ్డుపై వెళ్లే వాహనాలతోపాటు ఈ మూడు దిక్కుల నుంచి వాహనాలు టర్న్ చేసుకునేందుకు నిరీక్షించాల్సి వస్తుండటంతో తరచూ ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. శనివారం సాయంత్రం ఒక్కసారిగా రోడ్లపై భారీ సంఖ్యలో వాహనాలు నిలిచిపోవడంతో వాటిని కంట్రోల్ చేయడం పోలీసులకు ఇబ్బందిగా మారింది. వాహనదారులు నానా అవస్థలు పడ్డారు. దీంతో ఆర్టీసీ సిబ్బంది, ఓ బాటసారి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు సాయపడ్డారు. వారి సాయంతో పోలీసులు ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ఇబ్రహీంపట్నానికి మంజూరైన ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌ను వెంటనే ఏర్పాటు చేసి ట్రాఫిక్ కష్టాల నుంచి గట్టెక్కించాలని స్థానికులు కోరుతున్నారు.

'రియల్' పేరిట కుచ్చుటోపీ

- రూ.7 కోట్లతో పరారైన వ్యాపారి
- లబోదిబోమంటున్న బాధితులు

ఇబ్రహీంపట్నం రూరల్: రియల్ ఎస్టేట్ వ్యాపారం పేరుతో ఓ వ్యాపారి భారీగా కుచ్చుటోపీ పెట్టాడు. పెట్టుబడుల పేరుతో రూ.7 కోట్లు వసూలు చేసి ఉండాయించాడు. ఈ సంఘటన ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుల కథనం ప్రకారం.. తుర్కయంజాల్‌లో నివసించే అలుక రామకృష్ణారెడ్డి అలియాస్ కొండల్‌రెడ్డి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. అప్పుడప్పుడు నమ్మిన వారి నుంచి డబ్బులు తీసుకొని తిరిగిస్తుండేవాడు. ఈ క్రమంలో గత ఏడాదిగా 25 మందికి పైగా సామాన్య ప్రజలు, రైతుల వద్ద డబ్బులు తీసుకోవడం మొదలు పెట్టాడు. తుర్కయంజాల్‌లో నివసించే ఓ వ్యక్తి భూమి పాసుబుక్కులు పెట్టి వడ్డీకి రూ.40 లక్షలు ఇచ్చాడు. ఆదిబట్లకు చెందిన మరో వ్యక్తి రూ.7 లక్షలు ఇచ్చాడు. తుర్కయంజాల్, ఆదిబట్ల, మన్నెగూడతో పాటు చుట్టు పక్కల ప్రాంతాలకు చెందిన వారి నుంచి ఇలా రూ.7 కోట్ల వరకు తీసుకున్నాడు. వీరందరికీ గత సోమవారం డబ్బు ఇస్తానని నమ్మించాడు. అనంతరం పత్తా లేకుండా పోయాడు. గత నెల 28న ఇంట్లో ఎవ్వరికీ చెప్పకుండా వెళ్లిపోయాడని, ఎక్కడ వెతికినా ఆచూకీ లభించకపోవడంతో కుమారుడు 29న ఆదిబట్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కృష్ణయ్య తెలిపారు. మరోవైపు రామకృష్ణారెడ్డికి డబ్బులు ఇచ్చిన బాధితులు ఆదిబట్ల పోలీసులను ఆశ్రయించినట్లు తెలిసింది. పోలీసులు ఫిర్యాదు తీసుకోకపోవడంతో కోర్టును ఆశ్రయించేందుకు సిద్ధమైనట్లు సమాచారం. నిజమైన బాధితులుంటే నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేస్తే విచారణ చేపడతామని ఓ ఎస్‌ఐ తెలపడం విశేషం.

పేదల సంక్షేమమే ధ్యేయం

- సొంతింటి కలను నెరవేర్చడమే లక్ష్యం
- మంత్రి సబితారెడ్డి



సర్దార్‌నగర్‌లో డబుల్ బెడ్రూం ఇళ్లను ప్రారంభిస్తున్న మంత్రి సబితారెడ్డి. చిత్రంలో ఎమ్మెల్సీలు తదితరులు

మహేశ్వరం: పేద ప్రజల సొంతింటి కలను నెరవేర్చి ఆత్మ గౌరవంతో గొప్పగా జీవించాలనేదే సీఎం కేసీఆర్ ఆలోచన అని విద్యాశాఖ మంత్రి పి.సబితారెడ్డి పేర్కొన్నారు. తుక్కుగూడ మున్సిపల్ పరిధిలోని మంఖాల్, సర్దార్‌నగర్‌లో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను శనివారం ఆమె ప్రారంభించారు. లక్కీడ్రాలో దక్కించుకున్న 2,230 మంది లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేసి గృహ ప్రవేశాలు చేయించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడాలేని విధంగా రోడ్లు, విద్యుత్, డ్రైనేజీ, తాగునీరు వంటి సకల సౌకర్యాలతో కూడిన డబుల్ బెడ్రూమ్స్‌ను ప్రభుత్వం నిర్మించిందన్నారు. పేదోడి సొంతి కలను నేరవేర్చాలన్నదే ప్రభుత్వ సంకల్పమన్నారు. లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉండాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వ పరిధిలోని ఎన్‌ఐసీ సంస్థ ప్రత్యేకంగా రూపొందించిన ర్యాండమైజేషన్ సాఫ్ట్‌వేర్ ద్వారా ఆన్‌లైన్ డ్రా నిర్వహించామన్నారు. మొదటి విడతలో ఒక్కో నియోజకవర్గ పరిధిలో 500 మంది చొప్పున 2వేల మందిని ఎంపిక చేసినట్టు చెప్పారు. ప్రభుత్వం సంక్షేమ పథకాలతో నిరుపేదలకు అన్ని విధాలా అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు సురభి వాణీదేవి, దయానంద్, ఎగ్గె మల్లేశం, మలక్‌పేట్ ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల, కలెక్టర్ హరీశ్, అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, తుక్కుగూడ మున్సిపల్ చైర్మన్ కాంటేకార్ మధుమోహన్, ఆర్డీఓ సూరజ్‌కుమార్, తహసీల్దార్ మహమూద్ అలీ పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కేసీఆర్‌ను హ్యాట్రిక్ సీఎంను చేయాలి

పహాడీషరీఫ్: ముస్లిం, మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్‌కు మరోసారి పట్టం కట్టాలని, హ్యాట్రిక్ సీఎంను చేయాలని మంత్రి సబితారెడ్డి అన్నారు. పహాడీషరీఫ్ దర్గాకు రూ.1.5 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ప్రధాన రోడ్ల విస్తరణ, నూతన రహదారుల పనులకు శనివారం ఆమె శంకుస్థాపన చేశారు. అనంతరం బాబా షర్ఫొద్దీన్ దర్గాకు పూలు, చాదర్ సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. చారిత్రక నేపథ్యం కలిగిన పహాడీషరీఫ్ దర్గాకు వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా రోడ్ల విస్తరణ పనులకు శ్రీకారం చుట్టినట్టు తెలిపారు. కార్యక్రమంలో జల్‌పల్లి మున్సిపల్ కమిషనర్ ఎన్.వసంత, వైస్ చైర్మన్ ఫర్హానా నాజ్, కో–ఆప్షన్ మెంబర్ సూరెడ్డి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మీర్‌పేట: వైఎస్సార్ వర్ధంతిలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

వైఎస్‌కు ఘన నివాళి

మీర్‌పేట: పేద ప్రజల సంక్షేమం కోసం దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఎన్నో పథకాలను ప్రవేశపెట్టి వారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి అన్నారు. వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా శనివారం మీర్‌పేట మందమల్లమ్మ చౌరస్తాలోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైఎస్ హయాంలో పావలావడ్డీ రుణాలు, ఆరోగ్యశ్రీ, జలయజ్ఞం, ఇందిరమ్మ ఇళ్లు, వ్యవసాయానికి ఉచిత విద్యుత్ వంటి పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు నింపారని గుర్తు చేశారు. రాహుల్‌గాంధీని ప్రధానిని చేయడమే వైఎస్సార్‌కు నిజమైన నివాళి అని అన్నారు. కార్యక్రమంలో నాయకులు బర్రె రాజ్‌కుమార్, వెంకటేశ్ గౌడ్, చల్లా బాల్‌రెడ్డి, సిద్ధాల శ్రీశైలం, చల్లా శ్రీనివాస్‌రెడ్డి, కీసర యాదిరెడ్డి, ఐతరాజు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



షాద్‌నగర్: వైఎస్సార్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మెట్రో మూడో దశ రయ్ రయ్

- డీపీఆర్‌కు కన్సల్టెంట్ల నియామకం
- ఆర్వీ అసోసియేట్స్‌కు రెండు ప్యాకేజీలు
- సిస్ట్రా సంస్థకు మరో రెండు ప్యాకేజీలు
- మొత్తం 12 కారిడార్లు.. 278 కిలోమీటర్లు
- ప్రాథమిక నివేదికలకు 3 నెలల గడువు

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ మెట్రో రైల్ మూడో దశ ప్రాజెక్టుకు వడివడిగా అడుగులు పడుతున్నాయి. నగరానికి నలువైపులా, ఔటర్ రింగ్‌రోడ్డు మార్గంలో నిర్మించనున్న మెట్రో మూడో దశపైన ప్రాథమిక, సవివర నివేదికల కోసం శనివారం కన్సల్టెన్సీలను నియమించారు. సాంకేతికంగా అత్యధిక మార్కులు పొందిన ఆర్వీ అసోసియేట్స్‌కు 2 ప్యాకేజీలను అప్పగించగా, ఆ తర్వాత స్థానంలో ఉన్న సిస్ట్రా సంస్థకు మరో రెండు ప్యాకేజీలను అప్పగించినట్లు హైదరాబాద్ ఎయిర్ పోర్ట్ మెట్రో లిమిటెడ్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు.

- గత నెలలో కన్సల్టెన్సీల నియామకానికి టెండర్లను ఆహ్వానించగా 5 సంస్థలు బిడ్‌లను సమర్పించాయి. వీటిలో ఆర్వీ అసోసియేట్స్, సిస్ట్రా, యూఎంటీసీ, రైట్స్ అనే 4 సంస్థలు సాంకేతిక అర్హతను సాధించాయి. అనంతరం ఈ నాలుగింటి ఆర్థిక బిడ్‌లను ఆగస్టు 30న మెట్రో రైల్ భవన్‌లో తెరిచారు. ఆర్వీ అసోసియేట్స్ సాంకేతికంగానే కాకుండా తక్కువ ఆర్థిక బిడ్‌లను సమర్పించి ముందంజలో ఉన్నట్లు ఎన్వీఎస్ రెడ్డి పేర్కొన్నారు. మిగిలిన రెండు ప్యాకేజీలను అతితక్కువ ఆర్థిక బిడ్‌తో పాటు సాంకేతిక అర్హత పొందిన సిస్ట్రా సంస్థకు ఇచ్చినట్లు చెప్పారు.
- ఈ రెండు కన్సల్టెన్సీ సంస్థలు వచ్చే రెండు నెలల్లో ట్రాఫిక్ సర్వేలు, రవాణా రద్దీ అంచనాలు, ట్రాఫిక్ అంచనాలు, పలు రకాల రవాణా వ్యవస్థల విశ్లేషణ వంటి వివిధ అధ్యయనాలు పూర్తి చేసి ప్రిలిమినరీ ప్రాజెక్ట్ నివేదిక (పీపీఆర్)లను సమర్పించాలి. ఆ తర్వాత మూడు నెలల్లో మెట్రో రైలు అలైన్‌మెంట్, వయాడక్ట్/భూ ఉపరితల మార్గం/భూగర్భ మార్గం వంటి ఆప్షన్‌లు, స్టేషన్లు, డిపోలు, రైల్వే విద్యుత్ ఏర్పాట్లు, సిగ్నలింగ్, రైల్వే సమాచార వ్యవస్థ, రైలు బోగీలు, పర్యావరణం,సామాజిక ప్రభావం, ఆదాయ వ్యయ అంచనా, చార్జీల పట్టిక, ప్రాజెక్టు అమలు విధానం వంటి విషయాలపై సవివరణాత్మక ప్రాజెక్టు నివేదికలను (డీపీఆర్)లను సమర్పించాల్సి ఉంటుంది. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు ఈ కన్సల్టెన్సీ సంస్థలను వివిధ కారిడార్లలో సత్వరమే సర్వే పనులను ప్రారంభించాలని నిర్దేశించినట్లుగా ఎండీ తెలిపారు.



నగరానికి నలువైపులా..

నగరానికి నలువైపులా నిర్మించతలపెట్టిన మెట్రో మూడో దశలో మొత్తం 12 కారిడార్లలో 278 కిలోమీటర్లలో మాస్ రాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్ (ఎంఆర్‌టీఎస్) అందుబాటులోకి రానుంది. భారీ నిధులతో చేపట్టనున్న మెట్రో మూడోదశ ప్రాజెక్టు నిర్మాణంలో టీఎస్‌ఐఐసీ, హెచ్‌ఎండీఏ, జీహెచ్‌ఎంసీ, ఆర్‌అండ్‌బీ తదితర ప్రభుత్వ సంస్థలు, విభాగాల భాగస్వామ్యం కూడా ఉంది. ఈ ప్రాజెక్టులో 8 కారిడార్లలో మెట్రో విస్తరణ చేపట్టనుండగా, ఔటర్ మార్గంలోని మరో 4 కారిడార్లలో కొత్తగా నిర్మించనున్నారు. మూడో దశ మెట్రోను మొత్తం 4 ప్యాకేజీలుగా నిర్మించేందుకు హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో ప్రణాళికలను సిద్ధం చేసింది.

నాలుగు ప్యాకేజీలుగా మెట్రో నిర్మాణం

- మొదటి ప్యాకేజీలో బీహెచ్‌ఈఎల్–పటాన్‌చెరు–ఓఆర్‌ఆర్–ఇస్నాపూర్ (13కి.మీ), ఎల్‌బీనగర్– హయత్‌నగర్– పెద్దఅంబర్‌పేట్ (13 కి.మీ), ఓఆర్‌ఆర్ పటాన్‌చెరు ఇంటర్‌చేంజ్–కోకాపేట్–నార్సింగ్ ఇంటర్‌చేంజ్ (22 కి.మీ)
- రెండో ప్యాకేజీలో శంషాబాద్ జంక్షన్ మెట్రో స్టేషన్– కొత్తూరు–షాద్‌నగర్ (28కి.మీ), శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో రైల్ స్టేషన్–తుక్కుగూడ ఓఆర్‌ఆర్– మహేశ్వరం ఎక్స్‌రోడ్–ఫార్మాసిటీ (26 కి.మీ.) శంషాబాద్ ఓఆర్‌ఆర్ ఇంటర్‌చేంజ్– తుక్కుగూడ–బొంగుళూరు–పెద్ద అంబర్‌పేట ఇంటర్‌చేంజ్ (40 కి.మీ)
- మూడో ప్యాకేజీలో ఉప్పల్ క్రాస్‌రోడ్–ఘట్కేసర్ ఓఆర్‌ఆర్–బీబీనగర్ (25 కి.మీ.), తార్నాక ఎక్స్‌రోడ్– ఈసీఐఎల్ ఎక్స్‌రోడ్ (8 కి.మీ), ఓఆర్‌ఆర్ పెద్ద అంబర్‌పేట్ ఇంటర్‌చేంజ్–ఘట్కేసర్– శామీర్‌పేట్– మేడ్చల్ ఇంటర్‌చేంజ్ (45 కి.మీ)
- నాలుగో ప్యాకేజీలో జేబీఎస్ మెట్రో స్టేషన్ నుంచి తూంకుంట వరకు 17 కిలోమీటర్ల మార్గంలో డబుల్ ఎలివేటెడ్ ఫ్లై ఓవర్ లేదా మెట్రో రైల్, ప్యారడైజ్– కండ్లకోయ డబుల్ ఎలివేటెడ్ / మెట్రో (12 కి.మీ), ఓఆర్‌ఆర్ మేడ్చల్ ఇంటర్‌చేంజ్–దుండిగల్–పటాన్‌చెరు ఇంటర్‌చేంజ్ (29 కి.మీ).

'ట్యాంకు' దొంగల రిమాండ్

- బొలెరో, బైకు చోరీ వస్తువులు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన సీఐ ప్రతాప్‌లింగం



పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనం, వాటర్ ట్యాంకులు

షాద్‌నగర్ రూరల్: డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లపై ఏర్పాటు చేసిన ఓవర్ హెడ్ వాటర్ సింథటిక్ ట్యాంకులను దొంగిలించిన వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇందుకు సంబంధించిన వివరాలను శనివారం సీఐ ప్రతాప్‌లింగం వెల్లడించారు. మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలం, లక్ష్మీపల్లి గ్రామానికి చెందిన వాకిటి చందు, నవాబ్‌పేట మండలం కొండపూర్ గ్రామానికి చెందిన కల్మకల రాజు అనే ఇద్దరు వ్యక్తులు కలిసి షాద్‌నగర్ పట్టణ శివారులోని గుండ్లకుంటలో ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లపై ఏర్పాటు చేసిన 17 సింథటిక్ వాటర్ ట్యాంకులను దొంగిలించారు. విషయాన్ని గుర్తించిన డబుల్ బెడ్‌రూమ్ ప్రాజెక్టు మేనేజర్ నజీర్ అహ్మద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి పర్యవేక్షణ, డీఐ రామిరెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ నయీముద్దీన్, కానిస్టేబుళ్లు జాకీర్, రవి, యాదగిరి, మోహన్, రాజు, రఫీ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నిందితులను పట్టుకున్నారు. వీరినుంచి బొలెరో వాహనం, బైకు, 17 సింథటిక్ వాటర్ ట్యాంకులు, జేసీబీ బకెట్, రూ.60 వేల విలువ చేసే సెంట్రింగ్ మెటీరియల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

రాజీ మార్గమే రాజమార్గం

- లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి
- సీఐ వెంకటేశ్వర్లు



సీఐ వెంకటేశ్వర్లు

కడ్తాల్: ఈ నెల 9న ఆమనగల్లు కోర్టు ఆవరణలో నిర్వహించే నేషనల్ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆమనగల్లు సీఐ వెంకటేశ్వర్లు సూచించారు. శనివారం మండల కేంద్రంలో సీఐ మాట్లాడుతూ రాజీ మార్గమే రాజమార్గమని పేర్కొన్నారు. లోక్ అదాలత్‌ను ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. పెండింగ్ కేసుల పరిష్కారం కోసం ఇది మంచి అవకాశమన్నారు. సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకునేందుకు, స్నేహభావంతో మెలగడానికి లోక్ అదాలత్‌లు దోహదపడుతాయని తెలిపారు. ఇక్కడ రాజీ కుదుర్చుకున్న కేసులపై అప్పీలుకు అవకాశం ఉండదని చెప్పారు. అదేవిధంగా డ్రంకన్ డ్రైవ్, ఎక్సైజ్ కేసులు, అక్రమ ఇసుక రవాణా కేసుల్లో పట్టుబడిన నిందితులు నేరం ఒప్పుకుంటే వారికి జరిమానా విధించి కేసులు కొట్టివేస్తామని తెలిపారు.

బీఆర్ఎస్ తోనే అభివృద్ధి సాధ్యం

ఎమ్మెల్యే అంజయ్య యాదవ్



పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

నందిగామ: బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. సీఎం కేసీఆర్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్శితులై పలు పార్టీలకు చెందిన కార్యకర్తలు, నాయకులు స్వచ్ఛందంగా పార్టీలోకి చేరుతున్నారన్నారు. చంద్రాయన్ గూడకు చెందిన పలు పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు శనివారం ఎమ్మెల్యే నివాసంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ ఈట గణేశ్, సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకట్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, భీం రెడ్డి, నర్సింహా, శంకర్, మోహన్ రెడ్డి, రామస్వామి, యాదిరెడ్డి, శ్రీశైలం యాదవ్, విజయేందర్ రెడ్డి, నారాయణ, రాములు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి నిధులు మంజూరు..

నందిగామను మండల కేంద్రంగా తీర్చిదిద్దడమే కాకుండా అన్ని గ్రామాలను అభివృద్ధి చేసిన ఘనత ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌కే దక్కుతుందని జెడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేశ్, సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకట్ రెడ్డిలు పేర్కొన్నారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఇటీవల మండలంలోని అనేక గ్రామాలలో పల్లెబాట నిర్వహించి సమస్యలు పరిష్కరించేందుకు రూ. 5 కోట్లు నిధులు మంజూరు చేయించారన్నారు. చేగూరు నుంచి మాజీద్ మామిడిపల్లి వరకు డబుల్ బీటీ రోడ్డు నిర్మాణానికి రూ. 7 కోట్లు మంజూరు చేయించారని చెప్పారు. బండోనిగూడ నుంచి మద్దూరు వెళ్లే రోడ్డు అసంపూర్తిగా ఉండటంతో ఆ రోడ్డు పనులు పూర్తిచేయడానికి నిధులు మంజూరు చేశారని, నందిగామలో పాత జాతీయ రహదారి నుంచి బైపాస్ రోడ్డు వరకు డబుల్ రోడ్డుగా సీసీ, బీటీ రోడ్లను ప్రారంభించనున్నట్లు చెప్పారు. మండలంలోని 18 గ్రామ పంచాయతీలలో ఒక్కో గ్రామ పంచాయితీకి రూ. 15 లక్షల నుంచి 60లక్షల వరకు నిధులు మంజూరు చేసిన ఏకైక ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షుడు నోముల పద్మారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ అశోక్, మాజీ చైర్మన్ విఠల్, మాజీ ఎంపీపీ శివ శంకర్ గౌడ్, సర్పంచులు వెంకట్ రెడ్డి, రమేశ్ గౌడ్, స్వామి, చంద్రారెడ్డి, అశోక్, రాజు నాయక్, ఎంపీటీసీ రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవం



పూజలో ఆలయ అర్చకుడు రంగరాజన్

మొయినాబాద్: వేదపండితుల మంత్రోచ్చారణ మధ్య శనివారం మొయినాబాద్‌లో బొడ్రాయి ప్రతిష్ఠాపన వేడుకలు ఘనంగా నిర్వహించారు. సంబరాల్లో భాగంగా మూడు రోజులుగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. రెండు నెలల క్రితం ప్రమాదవశాత్తు కారు తగిలి బొడ్రాయి ధ్వంసమైంది. గ్రామంలో బొడ్రాయి లేకపోవడం మంచిది కాదని భావించిన స్థానికులు ప్రతిష్ఠకు నిర్ణయించారు. చిలుకూరు బాలజీ ప్రధాన అర్చకుడు సీఎస్ రంగరాజన్ పూజా క్రతువులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కాలె శ్రీకాంత్, ఏఎంసీ చైర్మన్ ఎంఏ రాహుప్, మాజీ జెడ్పీటీసీ చంద్రలింగంగౌడ్, నాయకులు మాధవరెడ్డి, మోహన్ రెడ్డి, రాజేశ్‌గౌడ్, సురేందర్‌గౌడ్, దర్శన్ రమేశ్, సత్యనారాయణ, రవీందర్, రాజుగౌడ్ తదితరులు ఉన్నారు.

ప్రాణం తీసిన డ్రైనేజీ గుంత

షాబాద్: చిన్నపాటి నిర్లక్ష్యం నిండు ప్రాణాన్ని బలి తీసుకుంది. ఇంటి ఎదుట డ్రైనేజీ నీటి కోసం తవ్విన గుంతను పూడ్చకపోవడంతో.. ఓ మహిళ అందులో పడి మృతి చెందిన సంఘటన షాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హైతాబాద్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైతాబాద్‌తండాకు చెందిన పల్యా రమణమ్మ(62) హైతాబాద్‌లో కూరగాయలు కొనుక్కొని కాలినడకన పక్కనే ఉన్న తండాకు బయలుదేరింది. హైతాబాద్‌లో రాకేశ్‌రెడ్డి ఇంటి ఎదుట డ్రైనేజీ నీటి కోసం కొద్ది నెలల క్రితం పెద్ద గొయ్యి తీశాడు. ఈ గుంతను దాటేందుకు ప్రయత్నిస్తుండగా.. అదుపు తప్పిన రమణమ్మ అందులో పడిపోయింది. అక్కడే ఆడుకుంటున్న పిల్లలు ఈ విషయాన్ని గ్రామస్తులకు చెప్పడంతో వారు పరుగున వచ్చి బయటకు తీశారు. కానీ అప్పటికే రమణమ్మ మృతి చెందింది. సమాచారం అందుకున్న ఎస్ఐ మహేశ్వర్‌రెడ్డి తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని, వివరాలు సేకరించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఇదిలా ఉండగా పంచాయతీ సిబ్బంది, అధికారుల నిర్లక్ష్యం కారణంగానే మహిళ మృతిచెందిందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్, గ్రామస్తులు మండిపడ్డారు. అయితే మురుగు నీరు పారేందుకు డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేసినా కొంతమంది నీరు పారకుండా అడ్డుకోవడంతోనే ఈ సమస్య ఎదురవుతోందని సర్పంచ్ కావలి మల్లేశ్ తెలిపారు. మురుగు నీరు సక్రమంగా పారకపోవడంతోనే యజమాని ఇంటి పక్కన గుంత తీశాడన్నారు.



మృతికి కారణమైన గుంతను చూపిస్తున్న సిబ్బంది